సాక్షి
శ్రీకాకుళం

శుక్రవారం ; 1 ; డిసెంబర్ ; 2023



పరిస్థితి మెరుగైంది..

జిల్లాలో హెచ్ఐవీ బాధితుల సంఖ్య తగ్గుతోంది. ప్రచార కార్యక్రమాలు మంచి ఫలితాన్నిస్తున్నాయి.

- 8లో



అరచేతిలో ఆరోగ్య శ్రీ

ఆరోగ్య శ్రీ అరచేతిలో ప్రత్యక్షమవుతోంది. దీనికి యాప్ రూపొందించారు.

- 8లో

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండు : వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ శుక్రవారం నుంచి మొదలుకానుందని డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు. ఈ నెలకు పింఛన్లన్నీ కలిపి 3,20,780 మంజూరయ్యాయని వీటికి గాను రూ.86.96 కోట్లు విడుదలైందని తెలిపారు. గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో వలంటీర్లు శుక్రవారం ఉదయం నుంచి పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు.

న్యూస్‌రీల్

ఫోర్జరీ సాల్వెన్సు సర్టిఫికెట్ తయారీదారులకు జైలు శిక్ష

శ్రీకాకుళం పాతబస్టాండు : కోర్టును మోసగిస్తూ ఒక రెవెన్యూ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి తప్పుడు సాల్వెన్సు సర్టిఫికెట్ తయారుచేసి కోర్టును మోసగించినందుకు గాను ముద్దాయిలు ఓరుగంటి ఈశ్వరరావు, ఆయనకు ష్యూరిటీ ఇచ్చిన పల్లె రాంబాబు, వర్రి అప్పలరాజులకు రెండేళ్ల పాటు జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ. 1500 చొప్పున జరిమానా విధించారు. అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయమూర్తి కె.రాణి ఈ తీర్పునిచ్చారు. ఈ కేసులో దర్యాప్తు అధికారిగా సీఐ దాడి మోహనరావు, ప్రభుత్వ న్యాయవాదిగా కె.సుశీల వ్యవహరించారు.

పోలీసు సిబ్బందికి నగదు రహిత వైద్యం



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో ఉన్న పోలీసు సిబ్బందికి నగదు రహిత వైద్యం అందించేలా అడుగు ముందుకు పడింది. జిల్లాకేంద్రంలో ఉన్న మెడికవర్ ఆస్పత్రిలో పోలీసు ఆరోగ్య భద్రత స్కీమ్ పథకం అందుబాటులోకి వచ్చిందని, ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో ఈ పథకం అమల్లోకి రావడం ఇదే ప్రథమం అని ఎస్పీ జీఆర్ రాధిక పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో వైద్య శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. మెడికవర్ ఆస్పత్రి హెడ్ డాక్టర్ శ్రీధర్ పోలీసు సిబ్బందికి అనేక విధాలుగా సహాయపడుతున్నారని, అందులో భాగంగానే ఈ పథకం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఇకపై మేజరు చికిత్సలన్నీ అందుబాటులో ఉన్నాయని అత్యవసర పరిస్థితుల్లో ఇతర జిల్లాలకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన అవసరం ఇకపై ఉండదన్నారు. నేత్ర వైద్యం, క్యాన్సర్, ప్లాస్టిక్ సర్జరీ, బర్న్స్ వంటివి మినహా అన్ని రకాల వైద్య సదుపాయాలు ఉంటాయన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఇక ప్రతిరోజూ ప్రతి పోలీస్‌స్టేషన్ నుంచి ఇద్దరు చొప్పున 50 మందికి వైద్య పరీక్షలు చేయించడం జరుగుతుందన్నారు. మేజరు సమస్యలైనా మెడికవర్‌లో చికిత్సచేస్తారని, వైద్య పరీక్షల్లో 30 శాతం డిస్కౌంట్ ఇస్తారన్నారు. కార్డియాలజీ విభాగం వైద్యులు అనిరుధ్ మాట్లాడుతూ కార్డియాలజీ సమస్యపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. వైద్యురాలు సాగరిక మాట్లాడుతూ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంటాయన్నారు. అనంతరం ఎస్పీ వైద్య శిబిరాన్ని ప్రారంభించి సిబ్బందికి అందించిన వైద్య పరీక్షలు పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు విఠలేశ్వరరావు, తిప్పేస్వామి, మెడికవర్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ మూడో సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు ఈ నెల 8వ తేదీ వరకు జరగనున్నాయి. సైన్స్ కోర్సుల నుంచి 375 మంది, ఆర్ట్స్ కోర్సుల నుంచి 143 మంది హాజరయ్యారు. ఆర్ట్స్, సైన్స్ ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్ పర్యవేక్షించారు.

చిట్‌ఫండ్ కిలాడీపై కేసు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

టెక్కలి రూరల్: చిట్స్ పేరుతో దాచుకున్న డబ్బులను ఒక మహిళ మోసం చేసి తీసుకుపోయిందని టెక్కలి పోలీసులకు పలువురు గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితులు తెలిపిన టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి రోటరీనగర్-1కు చెందిన రఘుపాత్రుని సబితదేవి, ఆమె భర్త ప్రసాద్ కొంతకాలంగా చిట్‌ఫండ్స్, వడ్డీల వ్యాపారం చేస్తున్నారు. రోటరీనగర్, అయ్యప్పనగర్ తదితర ప్రాంతాలకు చెందిన ఉద్యోగులతో సన్నిహితంగా ఉండి వారితో చిట్స్ కట్టించేవారు. అయితే వారం కిందట వారు ఉంటున్న ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయిందని, ఆమె పిల్లలు ఇక్కడే ఉన్నా వారిద్దరి ఆచూకీ కనిపించడం లేదని బాధితులు పోలీసులకు తెలిపారు. ఆమె వద్ద తమ సొమ్ము రూ.3 కోట్ల వరకు ఉంటుందని దాదాపు 30 మంది బాధితులు ఎస్ఐ రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆ బంగారం ఎక్కడ..?



- జిల్లాలో సంచలనమైన గార ఎస్‌బీఐ బంగారు ఆభరణాల మాయం కేసు
- రూ. 4కోట్లకు పైగా విలువైన 7కిలోల బంగారం అదృశ్యంపై విచారణ
- ఎస్‌బీఐ అధికారుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు
- గోల్డ్ మిస్సింగ్ కేసులో కీలకమైన వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడంతో సంక్లిష్టత

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

గార ఎస్‌బీఐలో ఖాతాదారులు కుదవ పెట్టిన బంగారు ఆభరణాలు మాయం కావడం జిల్లాలో సంచలనం సృష్టిస్తోంది. రూ.4కోట్ల 7లక్షల విలువైన 7కిలోల బంగారం కనబడకపోవడం కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్నట్లు చెబుతున్న ఒక మహిళా ఉద్యోగి ఇప్పటికే ఆత్మహత్య చేసుకుని చనిపోవడంతో కేసు మరింత సంక్లిష్టంగా మారింది. ఇప్పుడీ వ్యవహారం బ్యాంకు వర్గాలను కుదిపేస్తోంది. బంగారు ఆభరణాలు గల్లంతుపై పోలీసులకు లిఖిత పూర్వక ఫిర్యాదు కూడా అందడంతో ఇందులో ఎవరి ప్రమేయం ఏమిటో తేల్చే పనిలో పోలీసు యంత్రాంగం నిమగ్నమైంది. ఇప్పటికే ఫిర్యాదులో నలుగురిని స్పష్టంగా పేర్కొన్నారు. వీరితో పాటు బ్యాంకు అధికారులు, బయట వ్యక్తుల జోక్యంపైనా అనుమానాలుండటంతో పోలీసు వర్గాలు ఆరాతీస్తున్నాయి. ఈ బాగోతం ఎస్‌బీఐ బ్రాంచ్‌లో చోటు చేసుకున్నా జిల్లాలో అన్ని బ్యాంకులు అప్రమత్తమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఇలాంటివి ఇంకెక్కడైనా జరిగి ఉండొచ్చేమోనని బ్యాంకు వర్గాలు అలెర్టయ్యాయి.

ఎలా బయటకు వచ్చింది..



గార బ్రాంచిలో బంగారం ఆభరణాలు కుదవ పెట్టిన ఖాతాల బ్యాగులు 2500 వరకు ఉన్నట్టు సమాచారం. అందులో 86 బ్యాగులలో ఉన్న బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. ఓ ఖాతాదారు బ్యాంకుకు తనఖా పెట్టిన బంగారం విడిపించేందుకు వెళ్లగా బంగారం కనబడటం లేదని సమాధానం రావడంతో వ్యవహారం బయటికొచ్చింది. దాంతో అదే రోజు సాయంత్రం మరికొందరు ఖాతాదారులు బ్యాంకు వద్దకు చేరి విషయమై మేనేజరు సీహెచ్ రాధాకృష్ణ వద్ద అడుగగా రెండు రోజుల్లో చెబుతామని నచ్చ చెప్పి వెనక్కి పంపించారు. ఈ నేపథ్యంలో ఆ బంగారు ఆభరణాల రుణాల విభాగం బాధ్యతలు చూస్తున్న అకౌంటెంట్ స్వప్నప్రియను గట్టిగా ప్రశ్నించేసరికి 26బ్యాగులలో ఉన్న రూ. కోటి 75లక్షల బంగారు ఆభరణాలను తెచ్చి ఇచ్చారు. మిగతా 60బ్యాగుల బంగారు ఆభరణాలపై క్లారిటీ ఇవ్వలేదు. ఇంతలో ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. విశాఖలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనతో బంగారు ఆభరణాలు గల్లంతు వ్యవహారం మిస్టరీగా మారిపోయింది. అంతవరకు వ్యవహారాన్ని గుట్టుగా ఉంచిన అధికారులు తప్పని పరిస్థితుల్లో గార పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పుడా కనిపించని 60బ్యాగుల్లో రూ.4కోట్ల 7లక్షల విలువైన 7కిలోల బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఇవి ఎవరి చేతుల్లోకి వెళ్లాయి. ప్రస్తుతం ఎవరి వద్ద ఉన్నాయి. కీలకమైన వ్యక్తి చనిపోవడంతో దీంట్లో ఉన్న పాత్రధారులెవరో తేలాల్సి ఉంది. ఇంతవరకు అంతర్గతంగా తేల్చుకుందామని భావించినా పరిస్థితి చేయి దాటిపోవడంతో ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ గార పోలీసులకు ఫిర్యాదు చేశారు. నలుగురిపై ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరితో పాటు మరికొంతమంది కూడా ఉన్నట్టు అనుమానాలు ఉన్నాయి. ఈ కోణంలో పోలీసు అధికారులు విచారణ మొదలు పెట్టారు. ఇదిలా ఉండగా, 86బ్యాగుల వ్యవహారం వెలుగు చూడటంతో ఆ బ్రాంచ్‌లో ఉన్న మిగతా తాకట్టు ఆభరణాల బ్యాగులలో ఏవైనా తేడాలున్నాయా? అనే అనుమానాలు కూడా ఉన్నాయి. వాటిపైన కూడా దృష్టి పెట్టనున్నట్లు సమాచారం. గారలో జరిగిన ఘటనతో మిగతా ఎస్‌బీఐ బ్రాంచ్‌లలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఇతర బ్యాంకులు కూడా అప్రమత్తమైనట్టు తెలుస్తోంది. తమ బ్యాంకుల్లో ఉన్న బంగారు ఆభరణాల భద్రతపై ఆరా తీస్తున్నట్టు సమాచారం.

నమ్మకాన్ని వమ్ము చేసి..

బయట వ్యక్తుల వద్ద బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి సొమ్ము తీసుకోవడం శ్రేయస్కరం కాదని చాలా మంది బ్యాంకుల్లో తమ ఆభరణాలను కుదవ పెట్టి సొమ్ము తీసుకుంటారు. ఆ నమ్మకాన్ని గార ఎస్‌బీఐలో పనిచేసిన కొంతమంది ఉద్యోగులు వమ్ము చేశారు. సూత్రధారులు, పాత్రధారులెవరో విచారణలో తేలనున్నప్పటికీ రూ.4కోట్లకు పైగా విలువైన 7కిలోల బంగారాన్ని మాయం చేశారంటే చిన్న విషయం కాదు. ఇప్పుడా ఖాతాదారులంతా గగ్గోలు పెడుతున్నారు.

పర్యవేక్షణ డొల్ల..

సాధారణంగా బ్యాంకులో గోల్డ్ లోన్ విభాగం ప్రత్యేకంగా ఉంటుంది. దానికొక అసిస్టెంట్ మేనేజర్ హోదాలో ఉన్న అకౌంటెంట్ ఉంటారు. క్లర్క్ లేదా అప్రైజర్ ఉంటారు. వీరిద్దరు ఖాతాదారుల నుంచి తాకట్టు బంగారాన్ని తీసుకుంటారు. వీరితో పాటు ఇద్దరు కస్టోడియన్‌లు ఉంటారు. వీరిద్దరి వద్ద స్ట్రాంగ్ రూమ్, సేఫ్ (లాకర్లు)కు సంబంధించిన వేర్వేరు తాళాలు ఉంటాయి. అకౌంటెంట్, క్లర్క్ తీసుకున్న బంగారాన్ని కస్టోడియన్‌లతో కలిపి సేఫ్‌లలో భద్రపరుస్తారు. ఆ ఇద్దరు కస్టోడియన్‌ల వద్ద ఉన్న వేర్వేరు తాళాలను ఉపయోగిస్తే తప్ప భద్రపరచడం గాని, తీయడం గానీ జరగదు. ఇంతటి పకడ్బందీ వ్యవహారం ఉండే బ్రాంచ్‌లలో దాదాపు 7కిలోల బంగారం పక్కదారి పట్టిందంటే ఇందులో చాలామంది ప్రమేయం ఉండొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వాస్తవానికి బ్రాంచ్‌లో ఏం జరిగినా సంబంధిత మేనేజర్ బాధ్యత ఉంటుంది. దానితో పాటు ఉన్నతాధికారుల పరిశీలన ఉంటుంది. ఎన్నో సేఫ్‌లలో ఉన్న బంగారం పెద్ద ఎత్తున మాయమవ్వడంతో బ్రాంచ్ పర్యవేక్షణ డొల్లతనం బయటపడింది.

ఎన్నాళ్లో వేచిన ఉదయం..



టెక్కలిలో గురువారం హుద్‌హుద్ లబ్ధిదారులకు ఇంటి పత్రాలు అందజేశారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నూరుల్ కమార్, సమన్వయకర్త దువ్వాడ వాణి, ఎంపీపీ సరోజనమ్మ తదితరులు పాల్గొన్నారు.. ప్రభుత్వం చొరవ తీసుకుని పత్రాలను అందించడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. - టెక్కలి

కిడ్నీ ఆస్పత్రిలో డయాలసిస్

కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధమైంది. ఈ నెల 12వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో ఇప్పటి వరకు ఉన్న డయాలసిస్ సేవలు ఇప్పుడు కిడ్నీ ఆస్పత్రికి తరలించారు. యంత్రాలు వాడుకలో ఉండాలనే ఉద్దేశంతో ఇక్కడ డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతానికి ఉన్న మిషనరీలు అమర్చి వాటిపై ట్రయల్ రన్‌గా డయాలసిస్‌ను కొనసాగిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఈ ట్రయల్ రన్‌ను పర్యవేక్షించారు. ఈ డయాలసిస్ కేంద్రంలో 40 డయాలసిస్ మంచాలు ఉన్నాయి. మూడు, నాలుగు షిఫ్టులలో సేవలు ప్రారంభిస్తే రోజుకు 120 నుంచి 200 మందికి సేవలు అందనున్నాయి. - కాశీబుగ్గ



పండగ బెల్లం తయారీ



బెల్లం తయారీకి పేరుపొందిన నాగావళి పరివాహక ప్రాంతాలు కొరపాం, చేపానపేట, బుడితిపేట, నిమ్మతొర్లాడ, జీకేవలస గ్రామాల్లో రైతులు బిజీగా ఉంటున్నారు. ఇక్కడి బెల్లానికి రాష్ట్రం నలుమూలలా పేరు ఉండడంతో రైతులే నేరుగా గానుగలు ఏర్పాటు చేసుకుని బెల్లాన్ని తయారు చేస్తున్నారు. బెల్లం తయారీలో ఎలాంటి రసాయనాలు కలపకుండా తయారు చేస్తారు. రైతులంతా చెరుకు కొట్టడం మొదలు, బెల్లం తయారీ వరకు బిజీగా ఉండడంతో కూలీల కొరత కనిపిస్తోంది. రైతులు సొంతంగా తయారు చేసిన బెల్లంను మార్కెట్‌లకు తరలించి విక్రయిస్తారు. - ఆమదాలవలస రూరల్

గేమ్ చేంజర్

- క్రీడల అభివృద్ధి కోసం కీలక నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- నేటి నుంచి స్వతంత్ర్యంగా పనిచేయనున్న జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ
- సెట్ శ్రీ నుంచి శాప్‌ను వేరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు



కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వద్ద ఏర్పాటుచేసిన జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయం బోర్డు

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడలకు మళ్లీ మంచిరోజులు వచ్చాయి. వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. డిసెంబర్ ఒకటి నుంచి ఏపీ క్రీడాప్రాధికార సంస్థ(శాప్) స్వతంత్ర్యంగా పనిచేయనుంది. యువజన సర్వీసులశాఖ (సెట్‌శ్రీ) నుంచి శాప్‌ను వేరు చేస్తూ తాజాగా రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది.

మెర్జ్‌తో ఎన్నో సవాళ్లు, ఇబ్బందులు

2018 జనవరి 25న నాటి టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలో క్రీడాప్రాధికార సంస్థను యువజన సర్వీసుల శాఖలో కలిపేసింది. దీంతో క్రీడలపై కనీస అవగాహన లేని సెట్‌శ్రీ సీఈఓలకు పూర్తి అధికారాలను, పెత్తనాన్ని కట్టబెడుతూ మార్గదర్శకాలు జారీ చేసింది. అప్పటి వరకు డీఎస్‌డీఓలుగా వ్యవహరించినవారంతా చీఫ్ కోచ్‌లుగా మారిపోయారు. కోచ్‌లు, సిబ్బంది మొత్తం సెట్ శ్రీ సీఈఓ పర్యవేక్షణలో పనిచేస్తూ వేధింపులకు గురయ్యారు.

ఆధిపత్య పోరుతో మరిన్ని అవస్థలు

ముఖ్యంగా క్రీడాపోటీల నిర్వహణ, ఎంపిక పోటీలు, సమావేశాల నిర్వహణలో తీవ్ర గందరగోళం తలెత్తుతూ వచ్చాయి. పరిపాలన, నిధుల మంజూరు, చెక్ పవర్ కేటాయింపు, నివేదికల తయారీ, ముఖ్యంగా ఒలింపిక్ సంఘం, క్రీడాసంఘాలు, పీడీ పీఈటీలతో సమన్వయం తదితర అంశాలలో సెట్ శ్రీ, డీఎస్ఏ అధికారుల వాదోపవాదాలు, ఆధిపత్య పోరు బాహాటంగా కనిపించేది. ఒత్తిడిని తట్టుకోలేక ఇరుశాఖల నుంచి పలువురు అధికారులు బదిలీపై వెళ్లిపోయిన విషయం విదితమే. జిల్లాల పునర్విభజన వల్ల 13 జిల్లాలు 26 జిల్లాలుగా ఆవిర్భవించడంతో కష్టాలు మరింత రెట్టింపయ్యాయి. క్రీడలకు పూర్వవైభవాన్ని తీసుకురావాలని.. త్వరలో ఆడుదాం ఆంధ్రాను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తుండటంతో క్రీడలశాఖను వేరుగా చేయాల్సిన అవసరాన్ని కొందరు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కీలక నిర్ణయం తీసుకుని గత ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేసింది. వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయంపై ఒలింపిక్ సంఘం, క్రీడాసంఘాలు, పీడీ-పీఈటీ సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, క్రీడాభిమానులు, క్రీడాకారులు సంతోషం వ్యక్తంచేశారు. సీఎం జగన్‌కు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

నేటి నుంచి స్వతంత్ర్యంగా పనిచేస్తాం..



2018 జనవరి 25 నుంచి యువజన సర్వీసులశాఖలో శాప్‌ను విలీనం చేశారు. అప్పటి నుంచి సెట్‌శ్రీ సీఈఓకు అధికారాలను కట్టబెట్టారు. ఎట్టకేలకు రాష్ట్రప్రభుత్వం విలీన ప్రక్రియను రద్దుచేసింది. చీఫ్ కోచ్ స్థానంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా డిసెంబర్ 1 నుంచి పనిచేయనున్నాం.

- డాక్టర్ క్లోపల్లి శ్రీధర్‌రావు, డీఎస్‌డీఓ, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ శ్రీకాకుళం

సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో మెరిసిన పలాస



గుంటూరులో బహుమతి అందుకుంటున్న విద్యార్థి యుగంధర్, గైడ్ షణ్ముఖరావు

కాశీబుగ్గ: గుంటూరు జిల్లాలోని కేఎల్ యూనివర్సిటీలో ఈ నెల 29, 30వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో పలాస ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించారు. పర్యావరణ వ్యవస్థ ఆరోగ్యం కోసం సామాజిక, సాంస్కృతిక పద్ధతులు అనే విభాగంలో ఈస్ట్ కణాలు, జీడి పిక్కల తొక్క నుంచి చేసిన యాక్టివ్ కార్బన్ ఉపయోగించి భారలోహాలను బయోరేమీడిఎషన్ పద్ధతిలో పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థమైన నీటిని శుద్ధి చేసే ప్రాజెక్టు ప్రథమ స్థానం పొందింది. జాతీయ స్థాయిలో జరగబోయే పోటీలకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు డి.యుగంధర్, రాకేష్ గైడ్ టీచర్ షణ్ముఖరావు ఎంపికయ్యారు. వీరికి ప్రధానోపాధ్యాయులు డి.దాశరథి, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. ప్రస్తుత పారిశ్రామికీకరణ యుగంలో కర్మాగారాల నుంచి వెలువడే విష రసాయనాలలో ఉండే భారలోహాలు మానవులు, జంతువులు, జలచరాల మనుగడకు ఎంతో హాని కలిగిస్తున్నాయని, అందుకు ఈ సమస్యకు పరిష్కారం కోసం అభివృద్ధి చేసిన ఈ ప్రాజెక్ట్ ఈస్ట్ కణాలు, జీడి పిక్కల తొక్క నుండి చేసిన కార్బన్ ఉపయోగించి భారలోహాల పద్ధతిలో పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థమైన నీటిని శుద్ధి చేసిన అనంతరం నీటి వనరులతో కలిపితే పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. ఇది సహజమైన, సులభమైన పద్ధతి అని తెలియజేశారు.

మృతదేహంతో ధర్నా



రాజాం-శ్రీకాకుళం ప్రధాన రహదారిలో తీవ్ర ఉద్రిక్తత

జి.సిగడాం: స్థానిక వాండ్రంగి కూడలి వద్ద శ్రీకాకుళం-రాజాం ప్రధాన రహదారిపై గురువారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఓ ఉపాధ్యాయుడు మహిళను బైక్‌తో ఢీకొనడంతో ఆమె మృతిచెందారు. దీంతో ఆ మృతదేహంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. పూర్తి వివరాల్లోకి వెళితే..

ఆబోతుల పేట గ్రామానికి చెందిన ఆబోతుల పైడమ్మ గత నెల 29న వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా.. వాండ్రంగి సెంటర్ వద్ద ఉపాధ్యాయుడు బి.నారాయణరావు బైక్‌తో ఆమెను ఢీకొట్టారు. దీంతో ఆమె స్పృహ కోల్పోయారు. హుటాహుటిన ఆమెను శ్రీకాకుళంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులు నారాయణరావుకు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు. దీంతో గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు నారాయణరావు ఇంటి ముందు మృతదేహంతో ధర్నాకు దిగారు. దీంతో రాజాం-శ్రీకాకుళం రోడ్డులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మూడు గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయ్యింది. పరిస్థితి విషమించడంతో నారాయణరావు కుటుంబ సభ్యులు రూ.2.50 ఇస్తామని చెప్పారు. దీంతో పైడమ్మ బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోలీసుల రంగప్రవేశం

ధర్నాపై సమాచారం అందుకున్న రణస్థలం సీఐ ఆదాం, జి.సిగడాం, పొందూరు ఎస్ఐలు సామంతుల రామారావు, ఎస్.లక్ష్మణరావులతోపాటు సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి మృతురాలి బంధువులకు నచ్చజెప్పారు. నారాయణరావు వచ్చి మాకు క్షమాపణ చెప్పాలని, లేకుంటే ధర్నా విరమించబోమని చెప్పడంతో ఇరు కుటుంబాలతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. నారాయణరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామారావు తెలిపారు.



రూ. 30లక్షలు మంజూరు చేశారు



మాది జి.సిగడాం మండలం డీఆర్ వలస గ్రామం. మా బాబు హరియాణాలో ఉన్నత చదువులు చదివేందుకు జగనన్న ప్రభుత్వం రూ.30 లక్షలు మంజూరు చేసింది. నాకు ఆసరా, వడ్డీ లేని రుణం, రైతు భరోసా అందుతోంది. పిల్లలకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు ఇది వరకు చాలా కష్టంగా తెచ్చుకునేవాళ్లం. సురక్ష కార్యక్రమంతో సులభంగా ఈ పత్రాలన్నీ అందాయి. దీంతో పిల్లల చదువులు ఆనందంగా కొనసాగుతున్నాయి. ఇన్ని మంచి పనులు చేసిన సీఎం వైఎస్ జగనన్నకు రుణపడి ఉంటాం.

- కుమరాపు కుమారి, డీఆర్‌వలస, జి.సిగడాం

ఇల్లు మంజూరు చేశారు..



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వ వార్డు సూదికొండ సచివాలయం పరిధిలో ఉన్న సూదికొండ గ్రామంలో నివాసం ఉంటున్నారు. నాకు భర్త లేరు. ఒక్కపాప మాత్రమే ఉంది. ప్రస్తుతం నేను జీడి కార్మికురాలిగా జీవనం సాగిస్తున్నాను. నాకు సొంతిల్లు లేక అద్దె ఇళ్లలో బతుకుజీవుడా అని జీవిస్తున్నాను. వైఎస్ జగన్ సీఎం అయ్యాక నాకు ఉచితంగా ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు నగదు, ఉచితంగా నాలుగు ట్రాక్టర్ల ఇసుక, నిర్మాణానికి నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఇప్పుడు నేను సంతోషంగా సొంతింటిలో నివాసం ఉంటున్నాను. అంతే కాకుండా నాకు చేయూత పథకం సైతం మంజూరైంది. ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు.

- తర్ని మల్లేశ్వరి, సూదికొండ, 19వవార్డు, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ

క్లుప్తంగా

సర్వేయర్ల సంఘం జిల్లా కో ఆర్డినేటర్‌గా లోకేశ్వరరావు



సారవకోట: సచివాలయ సర్వేయర్ల సంఘం జిల్లా కో ఆర్డినేటర్‌గా మండలంలోని మాళువ సచివాలయ సర్వేయర్ లావేటి లోకేశ్వరరావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర సమావేశంలో లోకేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎంపికపై మండల సచివాలయం సర్వేయర్ల సంఘం సభ్యులు, ఇతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

రైలు ఢీకొని విద్యుత్ ఉద్యోగి మృతి



బేసి సునీల్(ఫైల్)

కంచిలి: స్థానిక విద్యుత్ శాఖలో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న బేసి సునీల్(30) బూరగాం గ్రామం వద్ద గుర్తు తెలియని రైలు ఢీకొని బుధవారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయం గురువారం ఉదయం పలాస జీఆర్‌పీ పోలీసులకు స్థానిక రైల్వే సిబ్బంది ద్వారా తెలిసింది. సునీల్ విధి నిర్వహణలో భాగంగా బూరగాం గ్రామంలో విద్యుత్ బిల్లులు వసూలుకు బుధవారం మధ్యాహ్నం వెళ్లి, అక్కడ ట్రాక్ దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు, విద్యుత్ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు.

సునీల్ సోదరుడు కూడా..

సునీల్ పూర్ణచంద్రరావు-తంబోలో ప్రధాన్‌ల రెండో కుమారుడు. గతంలో సునీల్ సోదరుడు సుమన్ కూడా విద్యుత్ శాఖలో పనిచేస్తూ కరెంట్ పోల్ నుంచి జారపడి మృతి చెందాడు. ఆ ఉద్యోగమే సునీల్‌కు వచ్చింది. ఇప్పుడు ఇతను కూడా మృతి చెందడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకొన్నాయి. సునీల్ బాగా పనిచేస్తాడని స్థానికంగా పేరుంది. సహచర ఉద్యోగులు, ఉన్నతాధికారుల వద్ద కూడా మంచి పేరు తెచ్చుకున్నాడని, హఠాత్తుగా సునీల్ మరణ వార్త వినగానే అంతా నిర్ఘాంతపోయారు.

సెల్ టవర్ ఎక్కి హల్‌చల్



కిందకు దిగుతున్న గోపి

మందస: మందస పట్టణంలో ఓ యువకుడు గురువారం సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ సృష్టించాడు. చేతిలో సెల్‌ఫోన్ పోగొట్టుకోగా, కుటుంబ సభ్యులు మందలించారని బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ పైభాగానికి ఎక్కి కలకలం సృష్టించాడు. వివరాలిలా ఉన్నాయి. బోయివీధికి చెందిన సీహెచ్ గోపి మొబైల్ పోగొట్టుకున్నాడు. ఇంటికి వెళ్లగా భార్యతో సహా కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మద్యాన్ని సేవించిన గోపి.. పక్కనే ఉన్న సెల్‌టవర్ పైభాగం వరకు ఎక్కి కిందకు దిగనని మొండికేశాడు. స్థానికులు పోలీసులకు, అధికారులకు సమాచారం అందించారు. తక్షణమే ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు, ఏఎస్‌ఐ శేఖరరావు, ఎంఆర్‌ఐ సవర చిన్నారావులతో పాటు పలువురు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. టవర్‌పై ఉన్న గోపితో మాట్లాడి, నచ్చజెప్పారు. వారి మాట విని గోపి కిందకు దిగాడు. అయితే గోపి కిందకు దిగేంత వరకు అంతా భయాందోళనకు గురయ్యారు. పోలీసులు, అధికారులు కౌన్సిలింగ్ ఇవ్వడంతో ఇంటికి వెళ్లాడు.

ఐదు నుంచి మూడో సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని అఫిలియేషన్ కళాశాలల డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల ఐదో తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. పరీక్షల కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటలు వరకు పరీక్షలు 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 54 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. రెగ్యులర్‌గా 7042, సప్లిమెంటరీలో 3439 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ముగియగా, ఈ నెల 2వ తేదీ వరకు అదనపు రుసుంతో చెల్లించే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు.

'పశువులను కబేళాకు తరలించవద్దు'

మందస: అంబుగాంలో ప్రతి బుధవారం సంత జరుగుతుంది. ఇక్కడ పశువులను కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సమరసత సేవా ఫౌండేషన్, రైతు సంఘం నాయకులు బెస్త కామేశ్వరరావు, కొర్ల హేమారావు చౌదరి అగ్గన్న జయరాజు అంబుగాంలో పశువులు ఉంచిన స్థలానికి వెళ్లి.. పశువుల అక్రమ రవాణా నిలిపివేయాలని సూచించారు. కొన్నేళ్లుగా ఈ ప్రాంతం నుంచి పశువులను కబేళాలకు తరలిస్తున్నారని, దీంతో తాము స్పందించాల్సి వచ్చిందన్నారు. గోవధశాలలకు పశువులను తరలించవద్దని రవాణాను అడ్డుకున్నారు. అంబుగాం ఇదే పరిస్థితి కొనసాగితే ఉద్యమిస్తామన్నారు.

అవగాహన పెరిగింది.. పరిస్థితి మెరుగైంది



నరసన్నపేట ఆస్పత్రిలో లింక్ ఏఆర్‌టీ సెంటర్

జిల్లాలో ఇలా..

సంవత్సరం	పరీక్షించిన గర్భిణులు	హెచ్‌ఐవీ సోకిన గర్భిణులు	పరీక్షించిన ఇతరులు	హెచ్‌ఐవీ సోకిన ఇతర బాధితులు
2017/18	41727	36	71782	758
2018/19	71704	21	76276	654
2019/20	58961	17	76166	511
2020/21	29073	16	34172	295
2021/22	45857	20	69594	398
2022/23	53777	12	111346	346
2023/24(అక్టోబర్)	16331	09	27312	286

- జిల్లాలో తగ్గుతున్న హెచ్‌ఐవీ పాజిటివ్ కేసులు
- ఫలితమిస్తున్న అవగాహన కార్యక్రమాలు
- పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల్లో విస్తృతంగా పరీక్షలు
- నేడు ఎయిడ్స్ డే

నరసన్నపేట: జిల్లాలో హెచ్‌ఐవీ పాజిటివ్ కేసులు తగ్గుముఖం పడుతున్నాయి. 2016-17 లో 758 మందికి హెచ్‌ఐవీ నిర్ధారణ కాగా ఆ తర్వాత ఏటా తగ్గుతూ వస్తోంది. 2023-24 అక్టోబర్ వరకూ 286 మందికి వ్యాధి సోకినట్లు తేలింది. గ్రామగ్రామాన విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో కేసుల సంఖ్యలో తగ్గుదల కనిపిస్తోంది. అలాగే హెచ్‌ఐవీ సోకిన వారికి ప్రభుత్వం నుంచి మెరుగైన వైద్యం అందుతోంది. దీంతో వారి జీవన ప్రమాణాలు బాగా పెరిగాయి. మరోవైపు స్వచ్ఛంద సంస్థలు, వైద్య ఆరోగ్య శాఖ కృషితో మెరుగైన ఫలితాలు లభిస్తున్నాయి. ఇప్పుడు జిల్లాలో పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చినట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. హెచ్‌ఐవీ ఎక్కువగా రక్త మార్పిడి, సురక్షితం కాని శృంగారం వల్ల వస్తుంది. ఈ నేపథ్యంలో ఈ రెండింటిపై స్వచ్ఛంద సంస్థలు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాయి. దీంతో హెచ్‌ఐవీ బారిన పడుతున్న వారి సంఖ్య తగ్గింది. ఇక రక్త పరీక్షలు చేయించుకొనే అవకాశాలు ఎక్కువగా ఉండటం, వైరల్ లోడ్ తగ్గించే మందులు, పోషకాహారం ఇస్తుండటం తదితర కారణాలతో బాధితులకు కూడా స్వాంతన లభిస్తోంది.

వ్యాధి ఉన్నా ఆరోగ్యంగానే..

జిల్లా వ్యాప్తంగా ఏఆర్‌టీ (యాంటీ రిట్రోవైరల్) సెంటర్ల ద్వారా 6449 మంది మందులు తీసుకుంటున్నారు. వీరిలో 80 శాతం మంది వైరల్ లోడ్ టెస్ట్‌లు చేయించుకున్నారు. ఇలా వైరల్ లోడ్ టెస్ట్ చేయించుకొని, సరైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా 92 శాతం మందికి హెచ్‌ఐవీ ఉన్నా.. ఆరోగ్యంగానే ఉన్నారు. ఈ విధంగా హెచ్‌ఐవీ సోకి మందులు వాడుతూ ఆరోగ్యంగా ఉన్న వారి సంఖ్యలో రాష్ట్రంలో ఇతర జిల్లాలతో పోల్చితే శ్రీకాకుళం జిల్లా మెరుగ్గా ఉంది.

హెచ్‌ఐవీ బాధితుల కోసం ఉన్న సదుపాయాలు
సమగ్ర సలహా, పరీక్ష కేంద్రాలు 16
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో హెచ్‌ఐవీ పరీక్ష కేంద్రాలు-104
పట్టణ ఆరోగ్య కేంద్రాలు-16
ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నడుస్తున్న ప్రవేటు నర్సింగ్ హోమ్‌లు-09
సుఖ వ్యాధుల చికిత్స కేంద్రాలు -03
ఏఆర్‌టీ సెంటర్లు-2 (శ్రీకాకుళం రిమ్స్, టెక్కలి)
లింక్ ఏఆర్‌టీ సెంటర్లు -09
టార్గెటెడ్ ఇంటర్‌వెన్షన్ ఎన్‌జీఓ సేవలు-02
కేర్,సపోర్టు సెంటర్-01 (జిల్లా పాజిటివిటీ నెట్‌వర్క్ సంస్థ, శ్రీకాకుళం)
రక్త నిధి కేంద్రాలు -02 (శ్రీకాకుళం,టెక్కలి)
ప్రైవేటు రక్త నిధి కేంద్రాలు -07
బ్లడ్ స్టోరేజీ సెంటర్లు-13
హెచ్‌ఐవీ వైరల్ లోడ్ ల్యాబ్ 01 (శ్రీకాకుళం రిమ్స్)

నెల రోజులు చైతన్యం



జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ రెండో తేదీ నుంచి నెల రోజుల పాటు వివిధ ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నాం. శుక్రవారం పీహెచ్‌సీ కేంద్రాలతో పాటు ప్రధాన కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించాలని ఇప్పటికే వైద్య సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం. ఎయిడ్స్ నియంత్రణ మన చేతుల్లోనే ఉందనేది ప్రజలకు పూర్తిగా ఈ నెల రోజుల్లో అవగాహన కలిగించనున్నాం.

– బి.మీనాక్షి, డీఎంహెచ్‌ఓ, శ్రీకాకుళం

బాధితులకు ప్రభుత్వ సహకారం



ఎయిడ్స్ నియంత్రణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. రక్త నిధి కేంద్రాల నుంచి మొబైల్ చికిత్సల వరకూ అన్ని రకాలుగా బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. జిల్లాలో అవగాహన కార్యక్రమాలు ముమ్మరంగా చేస్తున్నాం. ముఖ్యంగా గర్భిణుల నుంచి పిల్లలకు సోకకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. మందులు సక్రమంగా బాధ్యతగా అందిస్తున్నాం. గతంతో పోల్చితే మందులు ఒక ట్యాబ్లెట్ ఇప్పుడు ఇస్తున్నాం. దీంతో హెచ్‌ఐవీ సోకిన వారూ హాయిగా జీవిస్తున్నారు. రోగులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

– కె.ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రోగ్రాం మేనేజర్, శ్రీకాకుళం

విజయ దరహాసం



తల్లిదండ్రులు, తాతతో పిరియా జాగృతి

- ప్రతిష్టాత్మక లండన్ బిజినెస్ స్కూల్‌లో మాస్టర్స్ ఇన్ మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుకు ఎంపికైన పిరియా జాగృతి
- ఆనంద డోలికల్లో జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, సాయిరాజ్ దంపతులు

కవిటి: జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ, పిరియా సాయిరాజ్ దంపతుల ఏకైక కుమార్తె పిరియా జాగృతి తల్లిదండ్రుల కీర్తిని పెంపొందిస్తూ లండన్ బిజినెస్ స్కూల్‌లో మాస్టర్స్ ఇన్ మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుకు ఎంపికైంది. ఈమె ఎల్‌కేజీ నుంచి +2 తరగతి వరకు విశాఖపట్నంలోని టింఫనీ స్కూల్‌లో చదివింది. అనంతరం ప్రవేశ పరీక్షలో ఐదో ర్యాంకు తెచ్చుకుని బెంగళూరులోని మౌంట్‌కార్మెల్ బిజినెస్ స్కూల్‌లో బీబీఏ సీటు సంపాదించింది. ఇదే యూనివర్సిటీ నుంచి బీబీఏను డిస్టింక్షన్‌లో పాసైంది. ఆ మార్కులతో ప్రపంచ స్థాయి ప్రతిష్ట కలిగిన బెంగళూరులోని గోల్డ్‌మేన్‌శాక్స్(వరల్డ్ నంబర్3 ర్యాంకింగ్) అనే కంపెనీలో ఉద్యోగానికి ఎంపికైంది. బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ సైతం ఇదే సంస్థలో ఉద్యోగిగా పనిచేశారు.

ఈ సంస్థలో ఏడాదిన్నరగా ఉద్యోగం చేసిన అనంతరం ఇటీవలే ప్రపంచ స్థాయిలో మూడో ర్యాంక్ కలిగిన ప్రతిష్టాత్మక లండన్ బిజినెస్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకుంది. ప్రపంచ స్థాయిలో 10000 మందికి పైగా దరఖాస్తు చేసుకుంటే స్క్రీనింగ్‌లో 250 మందిని ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జాగృతి మాత్రమే మాస్టర్స్ ఇన్ మేనేజ్‌మెంట్ పీజీ కోర్సులో ప్రవేశానికి అర్హత సాధించడం విశేషం. జాగృతి స్ట్రాటజీ మేనేజ్‌మెంట్‌పై పారిస్‌లోని హెచ్‌ఈసీ యూనివర్సిటీలో ప్రత్యేక కోర్సు కూడా పూర్తి చేసింది. ఈ సందర్భంగా జాగృతి 'సాక్షి'తో మాట్లాడారు. చిన్నప్పటి నుంచి చదువులో ప్రత్యేకంగా ఏదైనా చేయాలన్న సంకల్పంతో చదివానని, దానికి అమ్మానాన్నలు విజయ, సాయిరాజ్‌లు ప్రోత్సహించారని, తాత పిరియా రాజారావు ప్రేరణ కలిగించారని తెలిపారు.

రైతు కష్టం బుగ్గిపాలు



కాలిబూడిదైన వరి పొలాలు

- పెద్దబొడ్డపాడులో అగ్ని ప్రమాదం
- రైతుల కళ్లెదుటే వరి పంట దగ్ధం

వజ్రపుకొత్తూరు: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంట అగ్నికి ఆహుతైపోయింది. పంట చేతికి వచ్చిందని సంబరపడిన అన్నదాతకు బూడిద మిగిలింది. వజ్రపుకొత్తూరు మండలం పెద్దబొడ్డపాడు గ్రామంలో గురువారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో వరి గడ్డి వాములు, వరి చేను, ఓవులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.3 లక్షలు వరకు నష్టం సంభవించి ఉంటుందని అంచనా వేస్తున్నారు. సమీపంలోని జీలుగు చెరువులో మంటలు చెలరేగి ఆ నిప్పు రవ్వలు దగ్గరలోని పొలాల్లో ఉన్న నూర్పు గడ్డిపై పడడంతో సంఘటన జరిగినట్లు రైతులు చెబుతున్నారు. గ్రామానికి చెందిన దుంపల రంగారావు, కణితి తిరుపతిరావు, కొండల బలుసాకు చెందిన వరిచేను ఓవులు, కుప్పలు దగ్ధం కాగా దుంపల ముఖలింగం, ప్రకాశరావు, ఉప్పాడ సింహాచలం, తులసమ్మ, పంది సన్యాసి, ధర్మారావు, శ్రీరాములు తదితర 20 మందికి చెందిన 25 ఎకరాల్లోని వరిగడ్డి వాములు దగ్ధమైనట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మంటల్లో బమ్మిడి భాస్కరరావుకు చెందిన సాగు నీరు తోడే ఇంజిన్ సైతం కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు. గాలి విపరీతంగా ఉండడంతో మంటలు దావానలంలా వ్యాపించాయి. దగ్గరలో నీరు అందుబాటులో లేకపోవడంతో రైతులు కర్రలతో మంటలపై కొట్టి కొంత మేర నష్టాన్ని తగ్గించారు. పలాస అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందడంతో వారు వచ్చి మంటలు అదుపు చేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు

గిరిజనులకు భూ పట్టాల పంపిణీ



నిరుపేదలకు పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

పాతపట్నం: గిరిజన రైతుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ అహర్నిశలు శ్రమిస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌తో కలిసి ఎమ్మెల్యే గిరిజనులకు వ్యవసాయ భూమి పట్టాలు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సాగు చేసుకునేందుకు అనుగుణంగా ఉండే భూములను అందించామన్నారు.

రైతు భరోసా, పంటల బీమా అందిస్తామని తెలిపారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు సాగు పట్టాలు ఉచితంగా ఇచ్చి పేదల జీవనోపాధిని మెరుగుపరుస్తున్నామని అన్నారు. మండలంలో గంగువాడ గ్రామంలోని 112 మంది నిరుపేదలకు, చిన్నపద్మాపురంలో 44 మందికి, లాబరలో 17 మందికి, హరిద్వారంలో 13 మందికి, బోరుబద్రకు 11 మందికి, ఆర్.ఎల్.పురంలో 8 మందికి, తెంబూరు 6మందికి, ప్రహరాజపాలేంకు 4 మంది పేదలకు పట్టాలు అందించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవిచంద్ర, డీటీలు ప్రసాదరావు, బీమారావులు, పార్టీ మండల అధ్యక్షుడు ప్రదీప్, మండల సచివాలయ కన్వీనర్ సూర్యం, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అప్పన్న, హిరమండలం పీఏసీఎస్ అధ్యక్షుడు సురేష్, నాయకులు పనుకు మోహన్, రంజిత్, శ్రీధర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సింగుపురంలో గడ్డి వాములు దగ్ధం



అగ్ని మంటలను వాటర్ పైపులతో అదుపు చేస్తున్న టెక్కలి అగ్నిమాపక సిబ్బంది

పాతపట్నం: మండలంలోని సింగుపురం గ్రామంలో గురువారం సాయంత్రం వరి చేనుతో పాటు గడ్డి వాములు అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగుపురం గ్రామానికి చెందిన చీకటి జగదీశ్వరరావుకు చెందిన 50 సెంట్ల వరి చేను, నాలుగు ఎకరాల వరి గడ్డివాము కుప్పలు అగ్నికి ఆహుతయ్యాయి. టెక్కలి అగ్నిమాపక కేంద్రం వారు వచ్చి మంటలు అదుపు చేశారు. అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.

అరచేతిలో ఆరోగ్యశ్రీ

- ప్రతి కుటుంబానికి ఆరోగ్యశ్రీపై అవగాహనకు డ్రైవ్
- నేటి నుంచే ఇంటింటికీ వైద్య సిబ్బంది
- ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా సన్నాహాలు
- రూ.వెయ్యి దాటిన ప్రతి ప్రొసీజర్ ఉచితమే
- ఆరోగ్య శ్రీ పరిధిలోకి 3,257 జబ్బులు



అరసవల్లి: సామాన్యుడి అరచేతిలో ఆరోగ్య శ్రీ ఉంచేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. డిసెంబర్ 1 నుంచి ఇంటింటికీ వైద్య సిబ్బంది వెళ్లి ఆరోగ్య శ్రీ పథకం ద్వారా అందుతున్న సేవలన్నింటిని క్షుణ్ణంగా వివరించేలా డ్రైవ్ మొదలుకానుంది. గుండెజబ్బులతో పాటు క్యాన్సర్ వంటి అతిపెద్ద జబ్బులను సైతం ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావడం ఈ రాష్ట్ర ప్రభుత్వ ఘనతగా చెప్పవచ్చు. గతంలో ఈ ఆరోగ్యశ్రీ పరిధిలో 1,059 ప్రొసీజర్స్ ఉండగా, ఇప్పుడు ఏకంగా 3,257 వ్యాధులను (ప్రొసీజర్స్) ఈ పరిధిలోకి తీసుకొచ్చారు.

ఇంటింటికీ ఆరోగ్యశ్రీ

ఈ అద్భుత వైద్య సేవల వివరాలు మరింతగా ప్రజలకు తెలియజేసేందుకు జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నేటి నుంచి ఇంటింటికీ వైద్యసిబ్బంది కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఏఎన్‌ఎం, వలంటీర్‌తో పాటు ఆశ వర్కర్ల బృందం ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్యశ్రీ సేవలు ఏమేరకు పరిధి ఉందో ఏయే జబ్బులకు ఉచితంగా శస్త్రచికిత్సలను చేసుకోవచ్చునో అలాగే నెట్‌వర్క్ ఆస్పత్రుల వివరాలను జనాలకు చెబుతారు. ఇటీవలే జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం ద్వారా జిల్లాలో గత నెల నుంచే సుమారు 637 హెల్త్ క్యాంపులను నిర్వహించి 2,22,425 మందికి ఉచితంగా వైద్యసేవలందించి, 5217 మందికి నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫరల్ చేసిన సంగతి విదితమే.

ప్రత్యేక యాప్‌గా ఆరోగ్యశ్రీ

ఆరోగ్య శ్రీ సేవలు అందరికీ సులభంగా అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా యాప్ తీసుకువచ్చారు. దీంతో మన అరచేతిలోకి ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఇంతవరకు ఆరోగ్యశ్రీ సేవలపై అవగాహన పూర్తిస్థాయిలో లేనివారికి సైతం మరింత అర్థమయ్యేలా ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రజల సొంత ఆండ్రాయిడ్ ఫోన్లలో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించి, ఎలా వినియోగించాలో సిబ్బంది వివరించనున్నారు. ఇదిలావుంటే 2019 నుంచి ఇప్పటివరకు 2.35 లక్షల మందికి రూ.500 కోట్లకు పైగా విలువైన వివిధ రకాల శస్త్ర చికిత్సలను ఆరోగ్యశ్రీ ద్వారానే సేవలందించారు.

9 క్లిక్‌లతో ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్

- ఆండ్రాయిడ్ ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్ క్లిక్ చేయాలి.
- సెర్చ్‌లో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ యాప్ అని టైప్ చేయాలి.
- ఇన్‌స్టాల్ బటన్ క్లిక్ చేయాలి.
- ఓపెన్ బటన్ క్లిక్ చేయాలి.
- ఆరోగ్య శ్రీ యాప్ డిస్‌ప్లే అవుతుంది.
- మీ ఆధార్ నంబర్‌ను టైప్ చేయాలి..మీ ఫోన్‌కు ఓటిపి నంబర్ వస్తుంది..ఆ నంబర్‌ను ఎంటర్ చేయగానే లాగిన్ అవుతారు.
- ఆస్పత్రులు అని ఉన్న చోట క్లిక్ చేయాలి.
- మీ అవసరాన్ని బట్టి తర్వాత వచ్చే నాలుగు ఆప్షన్స్‌ను నింపాలి.
- ఈక్లిక్‌తో సమీపంలోని ఆసుపత్రుల పేర్లు, ఆరోగ్య మిత్ర, ఆసుపత్రుల కాంట్రాక్ట్ నంబర్ల ఐకాన్లు డిస్‌ప్లే అవుతాయి. తగిన వైద్యం అందేలా సహాయపడుతుంది. అలాగే ఆస్పత్రులకు వెళ్లే మార్గాన్ని కూడా గూగుల్ మ్యాప్ ద్వారా చూపిస్తుంది.

ఇంటిలో ఒకరైనా డౌన్‌లోడ్ చేయాలి



డిసెంబర్ 1 నుంచి 31 వరకు ఈ డ్రైవ్‌ను చేపట్టనున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యశ్రీ కార్డులున్న, లేదా అర్హత ఉన్న కుటుంబాలకు కచ్చితంగా ఏఎన్‌ఎం, వలంటీర్ బృందం ఇంటింటికీ వెళ్లి ఇంటిలో కనీసం ఒకరి ఫోన్‌లోనైనా ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాలి. దీంతో ఆ ఇంట్లో ఎవరికి అనారోగ్యం కలిగినా వెంటనే ఏం చెయ్యాలో ఎలా ఎవరికి సంప్రదించాలో ఈ యాప్ ద్వారా తెలుస్తుంది.

– డాక్టర్ బి.మీనాక్షి, డీఎంహెచ్‌ఓ

అవగాహన కల్పిస్తాం..



ఆరోగ్యశ్రీ యాప్‌ను కొత్తగా ప్రవేశపెట్టాం. ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చే వ్యాధులు, ఇతరత్రా సేవల వివరాలతో పాటు దగ్గర్లో ఉన్న నెట్‌వర్క్ ఆస్పత్రుల వివరాలన్నీ యాప్‌లో ఉండనున్నాయి. ఇక ఆరోగ్యశ్రీ పథకంపై మరింత అవగాహన పెంచేలా ఇంటింటికీ వైద్య సిబ్బంది డిసెంబర్ 1 నుంచే వెళ్లనున్నారు. ప్రతి కుటుంబానికి ఆరోగ్యశ్రీ సేవల కోసం కచ్చితంగా తెలిసేలా చేయడమే ఈ డ్రైవ్ ప్రధాన లక్ష్యం. ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించుకునే అవకాశాలపై వివరించనున్నారు.

– డాక్టర్ ప్రకాశరావు, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్